# పెరుగుతున్న నిరర్థక ఆస్తులు

**బ్యాంకింగ్** రంగంలో సంక్షోభం స్వయం కృతాపరాధం. వ్యాపారాలు సవ్యమైన పద్ధతిలో అభివృద్ధి క్రమంలో వుంటున్నాయా, సెక్యూరిటిగా సరియైన ఆస్తులు (కోల్లేటరల్స్) వున్నాయా అనే వాటితో నిమిత్తం లేకుండా, సరైన వసూళ్ల పద్ధతి లేకుండా పెద్దఎత్తున అప్పులు ఇవ్వాలనే ఒత్తిడిని ప్రభుత్వరంగ బ్యాంకులు ఎదుర్కొంటున్నాయి. ఇది 2018 చివరినాటికి 11 లక్షలకోట్ల రూపాయల నిరర్థక ఆస్తులకు దారితీసింది. గత పది సంవత్సరాలలో ఈ ఎన్‌పిఏలలో 7 లక్షల కోట్ల రూపాయలు రద్దుచేయగా మిగిలిన విలువ ఇది.

2015 నుండి ఈ ఎన్‌పిఏలు పెరుగుతూ ఎంతటి స్థాయికి చేరుకున్నాయంటే ప్రభుత్వరంగ బ్యాంకుల ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి దాపురించింది. 2016 – 17 సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంకులు ఇచ్చిన రుణాలు మొత్తం రుణాల్లో 69 శాతంగా వున్నాయి. ఈ భారమంతా వ్యవసాయంపైన, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపైన పడుతోంది. గత ఐదేళ్ళుగా ఈ రంగాలకు బ్యాంకింగ్ సేవలు బాగా తగ్గి పోయాయి. నష్టాల ఊబిలో వున్న బ్యాంకులు దివాళా తీయకుండా వుండటానికి ప్రభుత్వం వాటిని లాభాలతో నడుస్తున్న బ్యాంకులతో కలిపివేయటంవలన 21గా వున్న ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్య 12కు తగ్గిపోయింది.

82శాతం నిరర్థక ఆస్తులు కార్పొరేట్ రుణాలకు చెందినవేననే వాస్తవం ఈ సంక్షోభానికి గల మూలకారణాన్ని తెలియజేస్తోంది. పి.చిదంబరం కేంద్ర ఆర్థికమంత్రిగా వున్నప్పుడు నిరర్థక ఆస్తులలో సింహభాగం 30 కుటుంబాలు రుణాలను ఎగవేయటం వల్లనేనని అధికారికంగా ప్రకటించాడు. త్వరలోనే వారి పేర్లు కూడా వెల్లడిచేస్తానన్నాడు. ఎన్నికల సమయంలో బిజెపి, ఎన్‌పిఏలకు కారణమైన ఎగవేతదారులను శిక్షిస్తానని హామీ ఇచ్చింది, కానీ ఆ దిశలో అది ఏవిధమైన చర్యలు చేపట్టలేదు.

రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, బడాపెట్టుబడిదారుల కలయికతో కూడిన సమూహం ప్రభుత్వరంగ బ్యాంకులపై అదుపు కలిగి వుంది. డిసెంబరు 18 నాటికి అంతమయ్యే 9 నెలల కాలంలో ఇండియన్ బ్యాంకు ఒక్క ఉదుటున రు.156702 కోట్ల విలువను తగ్గించివేసింది. గత పది సంవత్సరాల కాలంలో అది ఈవిధంగా తగ్గించిన ఆస్తుల విలువ 7 లక్షలకోట్ల రూపాయలు. ఎన్‌పిఏల విలువ తగ్గింపు మొత్తంలో దాదాపు ఐదింట నాలుగు వంతులు మోడీ అధికారంలోకి వచ్చిన గత ఐదు సంవత్సరాల కాలంలో పెరిగినవే. బడాబూర్జువాల పట్ల చూపిస్తున్న ఈ ఉదారత్వాన్ని సాధారణ ప్రజలు భరించవలసివస్తోంది. పెట్టుబడుల పునర్వ్యవస్థీకరణ కోసం ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రజాధనాన్ని ఉపయోగించటం ద్వారా ఈ పరిస్థితి నుండి గట్టెక్కటానికి చూస్తున్నాయి.

ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీక రించటమే అన్ని సమస్యలకు ఏకైక పరిష్కారంగా అనేకమంది బ్యాంకింగ్‌రంగ 'నిపుణులు' సలహా ఇస్తున్నారు. ప్రైవేటు బ్యాంకులు లాభార్జన ధ్యేయంతోనే నడుస్తున్నందున అవి పట్టణ ప్రాంతాలకే పరిమితమైనాయి. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించితే అవి వ్యవసాయం నుండి, చిన్న చిన్న రుణాలందించటం నుండి వైదొలగుతాయి. ప్రైవేటు బ్యాంకులైన ఐసిఐసిఐ, యాక్సిస్ బ్యాంకు, ఎస్ బ్యాంకు వంటివి కూడా ఎన్‌పిఏలను కలిగి వున్నాయి. ఆ బ్యాంకులలోని ఖాతాదారుల సొమ్ము ప్రభుత్వ కనుసన్నలలోనే బ్యాంకు డైరెక్టర్ల జేబుల్లోకి చేరుతోంది. నిధులను దుర్వినియోగం చేసినందుకుగాను ప్రైవేటు బ్యాంకుల్లోని చాలామంది పెద్ద తలకాయలు నేరారోపణలతో ఇళ్ళకు పంపబడ్డారన్న వార్తలు మీడియాలో ప్రముఖంగా వచ్చాయి.

భారత బడాబూర్జువా స్వభావానికి పెరుగుతున్న ఎన్‌పిఏలు ఒక స్పష్టమైన నిదర్శనం. దాని దళారీ నిరంకుశాధికార స్వభావంతోటి, అది చట్టబద్ధంగాను, చట్టవిరుద్ధంగాను ప్రజా ధనాన్ని నిరంతరం స్వాహా చేస్తున్నది. భారత బడాబూర్జువావర్గం ప్రజాధనాన్ని పీల్చి పిప్పి చేయకుండా మనగడ సాగించలేదు.

ooo